క్లుప్తంగా

పైనలో 128 మందికి వైద్య పరీక్షలు



పైన గ్రామంలో గర్భిణికి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ శిరీష

పెదపూడి: పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఓ వరమని సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎస్‌యూ శిరీష అన్నారు. పైన గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 128 మందికి వైద్యులు శిరీష, సీహెచ్‌ఎంపీఎస్ శ్రావణి, ఆర్ వరలక్ష్మి తదితరులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ పేదలకు ఖరీదైన, కార్పొరేట్ స్థాయి వైద్యం అందజేస్తున్నామన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి గౌతమీ చంద్ర, వీఆర్వో టేకుమూడి శ్రీనుబాబు, ఏఎన్‌ఎం మందపల్లి నాగమణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా



బంగారు రాజు, సెబ్ సీఐ

మధురపూడి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అనుమానిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు కోరుకొండ సర్కిల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బంగారు రాజు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నిర్మానుష్య ప్రదేశాలు, పాడుపడిన భవనాలు నేరాలకు నిలయంగా ఉంటాయన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, ఎన్నికలకు ఆటంకం లేకుండా చూడటానికి ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సర్కిల్ పరిధిలోని 50 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామన్నారు. సారా నిర్మూలనలో భాగంగా 50 మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని, వారి నుంచి 875 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే 6,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

శ్యామలాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదపూడి: గ్రామంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కె.వెంకటరావు ఆధ్వర్యంలో అమ్మవారికి, స్వామి వారికి అభిషేకాలు, పంచమృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

అనపర్తి: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక ఎస్‌ఎన్‌ఆర్ ఫంక్షన్ హాలులో జరిగింది. బీజేపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధిలో రాష్ట్రం తిరోగమనం చెందిందన్నారు. సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయకుండా, నాణ్యత లేని మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు

ఎన్ని కూటములొచ్చినా మళ్లీ జగనే సీఎం

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ముకుందవరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం



ముకుందవరం ఎస్సీకాలనీలో ఎమ్మెల్యేపై పూలజల్లు కురిపిస్తున్న అభిమానులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టినా.. ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముకుందవరం గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత ఆయనకు గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. 2014లో 600కి పైగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. అందుకే చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి, వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారన్నారు. ఇచ్చిన హామీలన్నీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిచూపారన్నారు. నవరత్నాల పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. కులమతాలు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత టీడీపీ పాలనలో పేదలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే.. జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు, నాయకుల అండదండలూ ఉండాలన్నారు. టీడీపీకి ఓటేస్తే మళ్లీ 2014 పరిస్థితే పునరావృతం అవుతుందని హెచ్చరించారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, నాయకులు, ఎస్.రామచంద్రరావు, పందిరి ఆనంద్, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముకుందవరంలో వైఎస్సార్ సీపీలో చేరికలు

రంగంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముకుందవరం గ్రామంలో టీడీపీకి చెందిన ముప్పిడి పెద్ద నాగరాజు, ముప్పిడి యోహాను, ముప్పిడి చంద్రరావు, యార్లగడ్డ అబ్బులు, మద్దాల వెంకన్న తదితరులతో పాటు, మరో ఐదు కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి, అర్హులందరికీ అందించారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన ఒక్క పథకమూ లేదని ఎద్దేవా చేశారు.. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు అండ్ కో ఇప్పుడు ఏవేవో హామీలిస్తున్నారని, వారికి అధికారమిస్తే కుంటిసాకులు చెప్పి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతారని విమర్శించారు. ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్నామని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామని తెలిపారు.

ఆత్మీయ సమావేశానికి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: నగరంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి సంఘీయులందరూ తరలిరావాలని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కోటగుమ్మం సమీపంలోని శ్రీగౌరీ విలాస్ విశ్వబ్రాహ్మణ సత్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ కళానైపుణ్యానికి విశ్వబ్రాహ్మణ సంఘీయులు చిరునామాగా నిలుస్తారన్నారు. సమావేశానికి రాజమండ్రి అర్బన్ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్కోజు వీరభద్రరావు అధ్యక్షత వహించగా, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, విశ్వబ్రాహ్మణ సంఘ కార్యదర్శి అములోజు శివప్రసాద్, అనుపోజు వెంకటరమణ, మునినాడ సాగర్, కొమ్మోజు రాధాకృష్ణ, కొమ్మోజు దుర్గారావు, రత్నం, గోపి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం ఫ్యాన్‌కు ఓటేయాలి

డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భార్య ఆదిలక్ష్మి



బిక్కవోలులో ప్రచారం చేస్తున్న సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం బిక్కవోలులో రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో పాటు, ఎమ్మెల్యే అభ్యర్థి, తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల భవిష్యత్తును మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. పేద పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించే సరికొత్త విప్లవాన్ని తెచ్చారన్నారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తూ, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఇలాంటి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీరవెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకుడు గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థానికి, దోపిడీకి మధ్య పోరాటమిది

- విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఫరిజల్లిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జక్కంపూడి రాజా

రాజానగరం: నిస్వార్థానికి, దోపిడీకి మధ్య జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలు, విజ్ఞతతో ఆలోచించండి, పొందిన మేలు మరువకుండా ప్రజల బాగు కోసం, రాష్ట్ర ప్రగతి కోసం ఆరాటపడే జగనన్న ప్రభుత్వానికి మరొకసారి అవకాశం ఇవ్వండి అని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ఫరిజల్లిపేట, కానవరం, తోకాడలలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వపరంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారం కోసం ప్రతిపక్షాలు ప్రజలను బురిడీ కొట్టించేలా అమలుకు సాధ్యం కాని వాగ్దానాలతో మీ ముందుకు వస్తున్నాయని, వారు చెప్పే మాటలు నమ్మిమోసపోవద్దన్నారు. గడచిన ఐదేళ్లలో నిస్వార్థంగా ప్రజలకు సేవలందించామని, జక్కంపూడి కుటుంబానికి ప్రజలలో ఉన్న మంచి ఇమేజ్‌ని నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. ప్రత్యర్థుల జీవితాల గురించి ఒకసారి క్షుణ్ణంగా తెలుసుకోవడం మంచిదని సూచించారు. వారి గడచిన జీవితమంతా మోసపూరితంగా, దోపిడీ, దురాగతాలతో సాగిందన్నారు. ఎవరో ఏదో చెప్పారని కాకుండా వాస్తవాలను తెలుసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేయాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి అభివృద్ధి జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని జక్కంపూడి అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



గుమ్ములూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని, ఆయనతోనే ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధ్యమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరు, బుచ్చెంపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, ఎస్సీ పేట, బీసీ పేటల్లో పర్యటించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు, ఇంటి ముంగిటకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజానగరం నియోజకవర్గంలోని కోటికేశవరం పీహెచ్‌సీ విస్తరణ, సీతానగరం మండలంలో సీహెచ్‌సీని ఏర్పాటు చేశామన్నారు. గుమ్ములూరు అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్టు తెలిపారు. మౌలిక వసతుల కల్పన, తాగునీరు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణం జరిగిందన్నారు. బుచ్చెంపేట, గుమ్ములూరు, బూరుగుపూడి, మునగాల గ్రామాల్లో ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.92 కోట్లతో తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసియ్య, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, గుమ్ములూరు మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వరరావు, బుచ్చెంపేట సర్పంచ్ తాడేపల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు చీంద్రం శ్రీహరి, ఇండిగమెల్లి సత్యనారాయణ, మద్దాల చంటిబాబు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే జగనన్న ఆదర్శం

- డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ
- కూనవరంలో ఎన్నికల ప్రచారం



కూనవరంలో ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. మండలంలోని కూనవరంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి, వారితో మమేకమవుతూ ముందుకు సాగారు. రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో పారదర్శకంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నాయి. ఆ సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఉపసర్పంచ్ మండపాక గణేష్, మాజీ ఎంపీటీసీ బూలా ఏసు సంఖ్యాలో పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు పెదపాటి డాక్టర్‌బాబు, మండల ఆర్జీకె చైర్మన్ వలవల వెంకట్రాజు, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సాధారణ పరిశీలకులు కమల్ కాంత్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను నిర్దేశిత స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుస్తారు. ఇందుకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏ విధమైన ఫిర్యాదు చేయదలచినా ధవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో మే 12వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి 10 గంటలలోపు అందుబాటులో ఉంటానన్నారు. లేకుంటే 89779 35106 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నాలుగు తిరస్కరణ

రాజానగరం: నియోజకవర్గం నుంచి 18 మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లలో నాలుగింటిని తిరస్కరించామని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్ర వర్షిణి తెలిపారు. తిరస్కరించిన వాటిలో గంధం రాజశ్రీ (వైఎస్సార్ సీపీ), కట్టా శ్రీకృష్ణ (స్వతంత్ర), బత్తుల వందన అంబిక (స్వతంత్ర), జక్కంపూడి సత్తిబాబు (భారత యువజన చైతన్య పార్టీ) నామినేషన్లు ఉన్నాయన్నారు.

15 నామినేషన్ల తిరస్కరణ

అనపర్తి: సాధారణ ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగియడంతో శుక్రవారం స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారి ఎం.మాధురి, ఏఆర్‌ఓ ఎ.సునీల్‌బాబు నామినేషన్లు పరిశీలించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మొత్తం 24 మంది 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో 15 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నల్లమిల్లి మహాలక్ష్మి, బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎం.శివరామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సత్తి ఆదిలక్ష్మి, జై భారత్ నేషనల్ పార్టీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులుగా నామినేషన్ వేసిన కారి దాసు, కొమ్మన సత్యర్షూన్సీ, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసిన ఎస్.ప్రవీణ్‌కుమార్, కొమ్మిరి సారమ్మ, మజ్జి శ్రీనివాసరావు, సత్తి దేవదానరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రేలంగి నాగేశ్వరరావు, రేలంగి ఏసుబాబు, పులపకూర వీరవెంకట సత్యనారాయణ, ఒంటిమి అరవింద్ నామినేషన్లను అధికారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. దీంతో 9 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్టు అధికారులు ప్రకటించారు. వీరిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి ఎల్లా శ్రీనివాసరావు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కొల్లం శ్రీను, అఖిల భారతీయ జనసంఘ్ అభ్యర్థి కొవ్వూరి శివానందరెడ్డి, జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థి లింగం గంగాధర్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ సర్దార్ హుస్సేన్, స్వతంత్ర అభ్యర్థులు చెల్లె శ్రీను, పులగం సూర్రెడ్డి నామినేషన్లు సరైనవిగా అధికారులు వెల్లడించారు.

రోడ్డు మీదకు షాపులు.. రాకపోకలకు పాట్లు

- రాజానగరంలో తప్పని ట్రాఫిక్ కష్టాలు
- ఆక్రమణల చెరలో ప్రధాన రహదారి



రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఆక్రమణల కారణంగా స్తంభించిన ట్రాఫిక్

రాజానగరం: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో ప్రయాణికులను నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా, పరిష్కార చర్యలు తీసుకునే వారు కనిపించడం లేదు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు గానీ, పంచాయతీ సిబ్బంది గానీ స్పందించడం లేదు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మేజర్ సీసీ డ్రైనేజీలు ఉన్నాయి. వ్యాపారాలు జోరుగా జరిగే స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ, అన్నదాన సత్రం వైపు నుంచి కోదండ రామాలయం వరకూ ఉన్న సీసీ మేజర్ డ్రైనేజీ రోడ్డు ఆక్రమణలకు లక్ష్మణరేఖగా భావించేవారు. ఆ డ్రైనేజీలను దాటి వ్యాపారులెవ్వరూ రోడ్డు మీదకు రాకూడదంటూ గతంలో పంచాయతీ అధికారులు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకునేవారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

కొంతకాలంగా అటువంటి చర్యలు లేకపోవడంతో వ్యాపారులకు పూర్తి స్వేచ్ఛ దొరికింది. చాలామంది వ్యాపారులు తమ వ్యాపారాలను రోడ్డు మీదకు విస్తరిస్తుండటంతో రోడ్డు ఆక్రమణలకు గురై కుచించుకుపోయింది. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా గాంధీబొమ్మ సెంటర్ నుంచి అటు అన్నదాన సత్రం, ఇటు బస్టాండ్ సెంటర్ వరకూ దుకాణాల ముందు వాహనాలు పెట్టుకునే జాగా లేదు. ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డు పైనే పార్కు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు షెడ్లు వేసి మరీ రోడ్డు పైకి విస్తరిస్తున్నారు. ఇది ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుంది. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. ఎదురుగా వచ్చిన ఒక బస్సును మరో బస్సు తప్పించేందుకు కూడా చోటు ఉండడం లేదు.

పోలీసు జాడేది..!

గ్రామంలో నిత్యం ఎదురయ్యే ఈ సమస్యను పరిష్కరించే వారే కనిపించడం లేదు. ట్రాఫిక్ నియంత్రణ తమ విధులలో ఒకటిగా ఉన్న పోలీసులలో ఒక్కరు కూడా ఇక్కడ కూడలిలో కనిపించరు. కొద్ది దూరంలోనే ఉన్న పోలీసు స్టేషన్‌లో సుమారు 50 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ వారిలో ఏ ఒక్కరి డ్యూటీ కానట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఇదే గతంలో బస్టాండ్, గాంధీ బొమ్మ, వైఎస్సార్, హైస్కూల్ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు డ్యూటీ చేసేవారు. వారంలో రెండురోజుల పాటు సంత జరిగే మార్కెట్ ఏరియాలో సైతం పోలీసుల జాడ ఉండదంటే నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

> **ఆక్రమణలు తొలగించాలి**
>
> గ్రామంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ కారణంగానే కూడలి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముందుగా ఆక్రమణలను తొలగించి, ఆపై పోలీసులు డ్యూటీ చేస్తే ట్రాఫిక్ సమస్య క్షణాలలో పరిష్కారమవుతుంది. కానీ ఆ విధంగా చర్యలు తీసుకునేవారే లేరు.
>
> – పతివాద సూర్యనారాయణ, ప్రయాణికుడు, రాజానగరం